# నన్ను పెళ్ళాడేదెవరు?



నేను అప్పుడే కాలేజీనించి వచ్చి గదిలో పుస్తకాలు పెట్టి ముఖం కడుక్కోడానికి పెరట్లోకి వెళుతున్నాను. అప్పుడు వంటగదిలో ఉన్న మా అత్తయ్యతో మా నాన్న ఏదో చెబుతున్నాడు. నేను బహుశః నా పెళ్లి విషయమే అయి ఉంటుందని సవ్వడి చెయ్యకుండా వినాలని బుద్ధిపుట్టి అక్కడే ఆగిపోయాను. మా నాన్న అంటున్నాడు.

“చూడమ్మా! వాళ్ళు జాబు వ్రాశారు. మన అమ్మాయి వాళ్లకి నచ్చలేదుట! నల్లగా ఉంటుందిట. మాపైన ఆశ పెట్టుకోవద్దన్నారు” అని నిట్టూర్చాడు.

మా అత్తయ్య బాధతో, “దాని నొసట పెళ్లి రాసిఉందో, లేదో!” అంటూ, “మీ స్నేహితుల్ని అడిగి చూడండి. మరి ఎక్కడయినా మంచి సంబంధం ఉందేమో” అని హెచ్చరించింది మా నాన్నను.

“దానికి పెళ్లి అవుతుందని నాకు నమ్మకం లేదమ్మా! ఇది ఎన్నో సంబంధం అనుకున్నావు? పదోది! జ్ఞాపకం ఉందా?” అన్నాడు మా నాన్న విసుగుతో.

“ఎందుకు, అన్నా? అంత విసుగు, దాని బాధ చూస్తే నా కడుపు తరుక్కుపోతూంది” అన్నది మా అత్తయ్య.

“ఆఁ మరిచానమ్మా! మొన్ననే బజారులో రామయ్య శాస్త్రి కనబడి ‘కుమార్తె పెళ్లి తలపెట్టారటగా?

నాకు తెలిసిన సంబంధం ఒకటి ఉంది. వరుడి పేరు పరంధామయ్య. మంచి ఆస్తిపరుడు. ఇది రెండవపెళ్లి. వయస్సు నలభై దాటింది. మీకు నచ్చితే కబురు చెయ్యండి. పోయి మాట్లాడివస్తాను' అన్నాడు'' బదులు చెప్పాడు మానాన్న. దానితో మా అత్తయ్యకు కోపం వచ్చినట్టుంది. ''ఏమిటన్నా! చెప్పేవాళ్లకి మతి లేకపోతే నీకైనా ఉండవద్దూ! ఆ పసిపిల్లని చావుకు సిద్ధమైన తాతయ్యకిచ్చి, దాని గొంతు కోద్దామనా మీ ఉద్దేశం?'' అన్నది బాధతో.

'మరి నన్నేమి చేయమంటావమ్మా? దానికి వయస్సు పైబడుతూంది. వచ్చే సంబంధాలవారా, పిల్ల నచ్చలేదంటున్నారు. ఇక లోకమా, 'సిగ్గు ఎగ్గు లేకుండా ఎదిగిన పిల్లని చదివిస్తున్నాడు' అంటూంది. నేను ఎంతని బాధ పడేది?'' అన్నాడు. ''వయస్సు మళ్లితే నేమి? ఈ సంబంధమే చూస్తాను. వారిని పెళ్లి చూపులకు రమ్మని రాస్తాను'' అంటూ మా అత్తయ్య జవాబు అయినా ఎదురుచూడకుండా విసావిసా వెళ్లి పోయాడు నాన్న.

నేనిక అక్కడ ఉండలేకపోయాను. ముఖం కడుక్కోవడం కూడా మరిచిపోయి ఒక్క పరుగుతో నా గదికి పోయి తలుపు వేసుకుని, మంచంపైపడి, ఏడుస్తూ నా గత జీవితాన్ని, భవిష్యజ్జీవితాన్ని గూర్చి ఆలోచించడం మొదలు పెట్టాను.

ఏమిటిది? నిజంగా నా నొసట, మా అత్తయ్య అన్నట్టు పెళ్లియోగం రాసిఉందో, లేదో? నన్ను చూడడానికి ఎందరో వచ్చారు. వచ్చిన వారందరూ నేను నచ్చలేదని వ్రాసినవారేకాని ఒప్పుగున్నవారెవ్వరు లేరు. ఎందుకో? ఏమో? ఎందుకేమిటి? నేను అందంగా లేనట! నల్లగా, మాలకాకిలా ఉన్నానట! ముఖం మీద స్ఫోటకం మచ్చలు ఉన్నాయట. కొండముచ్చులా ఉన్నానట! కాని, వాళ్లు నా బాహ్యాకారాన్నే చూశారు. ఎవరు నా మనస్సును గురించిగాని, నా కోరికలను గురించిగాని ఆలోచించినట్లే కనిపించలేదు. వాళ్లలాగే నేనూ మనిషిననేది మరిచిపోయారు కాబోలు. వాళ్లకి ఉండే కోరికలు నాకు ఉండవనుకున్నారు కాబోలు. వాళ్లలో ఎన్ని లోపాలున్నా ఆ లోపాలు లెక్కించుకోరేం? వాలో లోపాలే బ్రహ్మాండంగా హాస్యమాడుతూ చెప్పుకుంటారేం? ఎందు కింతగా దిగజారిపోయారు పురుషులు? అనుకొని వాపోయేదాన్ని.

పక్కింటి అమ్మలక్కల ధోరణి చూద్దామా? వాళ్లు నలుగురు కలిస్తే చాలు, నా పెళ్లి ఊసే మాట్లాడుకునేవారు. ''ఆ నల్లకాకిని చూడడానికి ఎవరో వచ్చారట!'' అని ఒకత్తె అంటే, ''ఆ పోనిద్దూ! దాన్ని ఎవడు మెచ్చి చేసుకుంటాడు?'' అని ఇంకొకత్తె అంటే, ''చూడండి! తల్లిదండ్రులిద్దరూ బాగున్నారు. కాని, ఈ కొండముచ్చు వాళ్లకు ఏ నక్షత్రాన పుట్టిందో?'' అని మరి ఒకత్తె అంటూండేది. నేనా మాటలు వినలేక చావాలని అనుకునేదాన్ని. కాని, చచ్చి సాధించేది ఏమున్నదని తిరిగి నాకు నేనే ధైర్యం చెప్పుకుని ఊరట పొందేదాన్ని.

ఇక కాలేజీలో చూద్దామా? విద్యార్థులందరు నన్నుచూసి ''బ్యూటీ ఆఫ్ ది కాలేజ్ వస్తూంది చూడండిరా!'' అని హాస్యంతో గుసగుసలు పోయేవాళ్లు. అంతేకాదు. నేను అందంగా సింగారించుకుని పోకూడదు! పోయూనా, ''ఈ అందగత్తె ఎవర్ని వలలో

పెళ్ళి చేసుకోకున్నా బ్రతికేవాళ్ళు ప్రపంచంలో ఎంతమంది లేరు? అయితే వాళ్ళలో పలువురు మగవారు. పదిమందిని ఎదిరించి నిలబడగలవారు. స్త్రీ శక్తిస్వరూపిణే అయినా పెళ్ళాడకుండా బ్రతకలేదు.

వేసుకోవాలని సింగారించుకువచ్చిందో!'' అని నన్ను చూచి ఒక విద్యార్థి అంటే, ''ఛా దానికేమిరా! అప్సరసలాగుంది. దాన్నెవరు ప్రేమించరు?'' అని ఇంకొకడు నన్ను హాస్యమాడుతూంటే, నన్నెందుకు దేవుడు పుట్టించాడా? పుడుతూనే మా అమ్మ నా గొంతు నులిమి ఎందుకు చంపకపోయిందా? అనిపించేది. దుఃఖాన్ని దిగమింగలేక ఏ గోడచాటునో పమిట నోటికి అడ్డం పెట్టుకుని ఏడ్చేదాన్ని.

కర్మంచాలక నేను నా కోరికలు అణచుకోలేక, తల ఎత్తి ఏ విద్యార్థినైనా చూశానా? నా స్నేహితురాళ్లే వారిలో వారు చాటుగా ''చూడవే! బ్యూటీ ఆఫ్ ది కాలేజ్ ఎవరిమీద కన్నేసిందో'' అని ఒకత్తె అంటే, ''అట్లనా! ఆ నల్లముఖానికి అంత ఆశ ఉందా?'' అని నవ్వుతూ ఇంకొకత్తె అంటే, ''పోనీలేవే! అది తనకి ఎలాగా పెళ్లి కాదని చూపులతోనైనా తృప్తిపడదామనుకుందేమో?'' అని కులుకుతూ మరి ఒకత్తె అంటూంటే నాకు ఒళ్లు మండేది. వీళ్లు సాటి సోదరి మణులేనా? వీళ్లకన్న మగవారే నయం అనిపించేది. మళ్లీ నాలో నేనే 'నేను అనాకారిగా పుట్టి ఒకరిని నిందించడం ఎందుకులే!' అని నిరాశతో నా ముఖాన్ని నేను కోపంతో నద్దుకునేదాన్ని. గొంతు పిసుక్కునేదాన్ని.

ఒకసారి ఏమయిందో తెలుసా? నన్ను చూచిపోవడానికి వచ్చాడు ఒక వరుడు. అతడు ఎలా గుంటాడంటారా? కాల్చిన చింత మొద్దు మాదిరి నల్లగా ఉన్నాడు. బట్టతల. ఎత్తుపళ్లు. కాకి పొడవడానికైనా కండలేదు శరీరంలో. అంతటి అందగాడికి నేను నచ్చలేదట! అంతేకాదు. నా చెల్లెలు నచ్చిందిట! నా చెల్లెలు నాకన్నా అందంగా ఉండేది లెండి! ఆ జవాబుతో నేను బాధపడుతూంటే, నా బాధ చూసి సహించలేక, తాను ఉంటే నాకు పెళ్లి అవుతుందో లేదోనని, చెల్లాయి మా పెరట్లో బావిలో దూకి తన నూరేండ్ల జీవితాన్ని సర్వనాశనం చేసుకుంది. ఆ మరునాడే నేను చావాలని తయారయ్యాను. కాని, లోకానికి భయపడి, చావడం పిరికితనమే అనుకుని ఊరటపడి జీవచ్ఛవంలా బతుకుతున్నాను.

మా చెల్లాయి చనిపోయినప్పటినించి మా బంధువులు నన్ను తమకు ఇష్టం వచ్చినట్టు తిడుతూంటారు. ''అన్యాయంగా చెల్లెల్ని పొట్టన బెట్టుకున్నావు. నీవు ఏ నక్షత్రాన పుట్టావో? నీవైనా చావకూడదా? ఏ పీడ విరగడైపోయేది! ఆ బంగారు బొమ్మని మింగేసి చదువు వెలగ బెడుతున్నావు'' అని నా మోహం మీదే అనేవాళ్లు. వాళ్లకేమి తెలుస్తుంది నేను పడే మూగ బాధ? నేను గట్టిగా ఏడ్చానా? ''దీనికి పెళ్లి కాలేదని వగ ఏడుపులు ఏడుస్తూంది'' అని అవ్వగారు దవడలు నొక్కుకునేవారు. మీరే చెప్పండి, ఎలాగ నా బాధ తెలుపుకునేది?

నా బాధకు కారణం ఇంకొకటిఉంది. నేను అందంగా లేననుకుందాము. నాతో మాట్లాడడానికేమి? నాతో మాట్లాడితే నలుగురు నవ్వుకుంటారేమో నని, నేను మాట్లాడించినా ముఖం తిప్పుకుని పోతుంటారు నా మిత్రురాండ్రు అందరు. మరికొందరు తల్లులు, నేనెంతో మురిపెంతో వారి పిల్లల నెత్తుకుందామనుకుంటే, ''నిన్ను చూస్తే జడుసుకుంటారమ్మా పిల్లలు'' అని నా చేతికి ఇవ్వకుండానే ముసిముసినవ్వులు నవ్వుకుంటారు. మీకు తమాషాగా ఉందికదూ నా దుస్థితి? కాని, నేను పడే బాధ మీ కెలా అర్థం అవుతుంది? మీరు నా స్థితిలో ఉంటే అర్థం అయ్యేది!

మా నాన్నకు, మా అమ్మకు నా పెళ్లి ఒక సమస్యగా తయారయింది. మా అమ్మ నా పెళ్లి చింతతో మంచం ఎక్కింది. దానితో మా నాన్న మా అమ్మ బాధ చూడలేక, నన్ను చాటుగా పిలిచి, ''చూడు, తల్లీ! నీ బెంగతో మీ అమ్మ ఎలాగుందో? మనకి అన్ని విధాలా నచ్చాలంటే ఎలా, తల్లీ? మన నొసట ఎలాగుంటే అలా జరుగుతుంది. కాబట్టి నే నొక సంబంధం చూశాను. వయస్సు కొద్దిగా మళ్లిందిట. అయితేనేమి? ఆస్తి దండిగా ఉందట. నీకు ఇష్టమైతే చూపులకు రమ్మని రాస్తాను. చెప్పమ్మా!'' అన్నాడు. నేను బాధపడుతూ, వారి నెందుకు బాధపెట్టాలి? అని మనస్సును చిక్కబట్టుకుని నాకు ఇష్టమే అన్నాను. అంతే. దానితో మా నాన్న సంతోషించి, వెంటనే జాబు వ్రాయడము, వారు రావడము జరిగాయి.

మా నాన్న నాకన్నా ముందుగానే వచ్చిన వరుణ్ణి చూచి భయపడ్డారు. ఎందుకంటారేమో? మా నాన్నకన్నా పదేళ్లు పెద్దవాడుగా ఉన్నాడు ఆయన. తల అక్కడక్కడ నెరిసిపోయింది. పళ్లన్నీ ఊడినట్టున్నాయి. ఆ వరుణ్ణి గురించి ఒక వాక్యంలో చెప్పాలంటే, చావడానికి సిద్ధంగా ఉన్నాడని చెప్పవచ్చు! అట్టి వరుణ్ణే నేను చేసుకుంటానని ఒప్పుకున్నాను. ఎందుకంటారా? లోకం దృష్టిలో నాకూ పెళ్లి అయిందనిపించుకోవాలని. మా అమ్మను తృప్తిపరచాలని. కాని, నేను దానికి నోచుకోలేకపోయాను. ఏమంటే, అతనికి నేను నచ్చలేదట! నల్లగా, లావుగా ఉన్నానట. ఆ జవాబు విని నేను నవ్వాలో, ఏడవాలో మీరే చెప్పండి? ఆ నాటి నుండి నాకిక పెళ్లి కాదని నిశ్చయించుకున్నాను. మా అమ్మ నాకిక పెళ్లి కాదనే నిరాశతోను, బాధతోను చనిపోయింది. మా అమ్మ చనిపోయిన దుఃఖంతో నేనుంటే, ఇరుగు పొరుగు అమ్మలక్కలు, ''ఇది చెల్లెల్ని మింగింది చాలక, తల్లిని కూడా మింగింది. ఇక తండ్రినిమాత్రం విడుస్తుందా?'' అని వారికి తోచినట్టు తిట్టడం మొదలెట్టారు.

ఆ నాటినుంచి నా పైన నాకే పూర్తిగా వెగటు పుట్టింది. నా అందాన్ని నేనే అసహ్యించుకోవడం మొదలెట్టాను. బతుకుమీద నిరాశ ఏర్పడింది. కోరికలు చంపుకుని బతకడంకన్నా చావడమే మేలనిపించింది. నా మూలంగా మా చెల్లాయి, మా అమ్మ చనిపోయారు అంతేగాక బతికిఉన్న మా నాన్నకు నేను ఒక సమస్య అయి కూర్చున్నాను. కనకనే చావాలనిపిస్తూంది. పోనీ మీరే చెప్పండి, నల్లగా, వికారంగా ఉన్న నన్ను పెళ్లాడే దెవరు? నా జీవితము, నా యౌవనము అడవి గాసిన వెన్నెల కావలసిందేనా?

★

**మూర్తి**